# నేరేళ్ళ మస్తాన్ సురేషే నా దేవుడు...

...అని నేను చెప్తా ఉన్నానంటే యిట్టాంటి 'పీరు' నిజ్జంగానే ఉండాడనీ, యీ పీరు దర్గా మా జిల్లాలో యాణ్ణో ఒకదిక్కడ ఉండే ఉంటుందనీ అనుకునేరు సామీ...

అట్టాంటిదేమీ లేదు.

నేరెళ్ల మస్తాన్ సురేష్ అంటే మా యిస్కూల్లో నా క్లాస్‌మేటు. గుడ్డలాపారం చేసే శెట్టిగార్ల పిల్లోడు.యీడు నాకు దేవుడు ఎట్టయినాడో చెప్పే ముందు... చిన్నప్పుడు నాకొచ్చిన డౌటే మీకూ రాకుండా... యీడి పేరులో 'మస్తాన్' ఎట్టొచ్చిందో చెబుతా.

మా నెల్లూరు జిల్లాలో పేద్ద దర్గాలు... ఎవరికి ఏ కష్టమొచ్చినా సుకమొచ్చినా ఉసుక్కుమని పరిగెత్తే దర్గాలు రొండే రొండు. ఒకటిః నెల్లూరుకు దెగ్గరగా కసుమూరులో ఉండే 'కాలేషావలీ పీరు' దర్గా. రొండుః అత్మకూరు పక్కన్నే అన్నసముద్రం పేటలో ఉండే 'హజరత్ పీరు' దర్గా.

శుక్కురోరాలప్పుడు, సెలవలప్పుడు మాబోటోట్లం వస్తాపోతా నిద్దర్లు చేస్తాగీస్తా ఉన్నా యీ దర్గాలకు 'ఉర్సు' లొచ్చినాయంటే మా జిల్లావోళ్లకేగాకుండా చుట్టు పక్కల జిల్లాల వోళ్లకు కూడా మొక్కులు మొక్కుకునే, మొక్కులు తీర్చుకునే సీజను వచ్చిందన్న మాటే.

పిలకాయలు వుట్టలేదనీ ఆరోగ్యాలు బాగుండటం లేదనీ యాపారాలు కలిసిరావడం లేదనీ ఒకొకరు ఒకో మేలు కోరతా ఈ దర్గాల మీద వూల దుప్పట్లు పరిచి మొక్కులు మొక్కుకుంటారు.

దీనికి హిందువులు, ముసల్మానులు అనే బేదంలా. అందరిదీ ఒకటే బక్తి. ఒకటే నమ్మకం.

ఆ నమ్మకంతో వుట్టినోడే నేరెళ్ల మస్తాన్ సురేష్ గాడు.

ఈళ్ల నాయిన నేరెళ్ల సత్యనారాయణ 'కసుమూరు' దర్గాకు పొయ్యొచ్చినప్పుడు ఈడు వుట్టినాడంట. అందుకని చెప్పి పేరు మద్యలో 'మస్తాన్' వచ్చేలా చేసి 'మస్తాన్ సురేష్' అని పెట్టుకున్నాడు. (కసుమూరు కాలేషావలికి 'మస్తాన్ వలి' అనే యింకో పేరుంది. మా జిల్లాలో ఈయన మొక్కుతో వుట్టిన బిడ్డలకు 'మస్తాన్,' 'కాలేషా' అనే పేర్లు పెడతా ఉంటారు. మా జిల్లా హిందువుల్లో మస్తాన్‌రెడ్డి, మస్తాన్‌రావు, మస్తానయ్య వంటి పేర్లు కొల్లగా అవుపిస్తా ఉంటాయి. అదే విదంగా అన్నసముద్రంపేట హజరత్ పీరు మొక్కుతో వుట్టిన బిడ్డలకి హజరత్‌రెడ్డి, హజరతయ్య అనే పేర్లు పెట్టుకుంటా ఉంటారు).

మస్తాన్‌వలీ మొక్కు వుణ్యమా అని మస్తాన్ సురేష్‌గాడు వుట్టనయితే వుట్టినాడు గానీ వాడి కడుపున అక్షరమ్ముక్క వుట్టలా. నేనే మొద్దను కుంటే నా కన్నా మొద్దుగా తయారయిపోయినాడు మా కిలాస్‌లో. అదీగాక మా యింటి పేరు 'ఎండి' యీళ్లింటి పేరు 'ఎన్ ఎం' అయ్యే సరికి ఎమ్, ఎన్‌లు పక్క పక్కగా వచ్చి రిజిష్టర్లో మా నంబర్లు పక్కపక్కన్నే అయినాయి. దాంతో మేమిద్దరం నచ్చినట్టుగా పక్కపక్కనే కూచొని పరీక్షలు




రాయాల్సొచ్చేది.

సరిగ్గా యీ పాయింటు దెగ్గిర పండింది నా పంట!

ఒక్క లెక్కల్లో తప్ప మిగతా అన్ని పరీక్షల్లో సాద్యమైనంత సొంత కవిత్వం కలిపి (లెక్కల్లో సొంత కవిత్వం కలపడం నాకు కాదుగదా మాల్యాద్రయివోరి అమ్మా మొగుడికైనా సరే వీలు కాని పని) అన్నీ కొసెన్లకూ ఎట్టొకట్ట ఆన్సర్లు రాసేవాణ్ణి గానీ సురేషుగాడికి ఆ న్యాక్ తెలిసేది గాదు.

వాడు పరీక్ష మొదలుకాగానే ఒకటికి రొండు తెల్ల తావులు ఆట్టకు తగిలించుకొని, శుద్దంగా మార్జిన్లు గీసేసుకొని తెల్లమొకంతో దిక్కులు చూస్తా కూచునేవాడు.

ఎప్పుడైనా క్లవర్లను గీరి, గిల్లి 'చూపీరా... ప్లీజ్‌రా' అని గుసగుసగా అడిగితే... వాళ్లు తుస్కారంగా మొకం పెట్టి 'చూపిస్తే రమాదేవి టీచరు కొడ్తుందయ్యా' అనే వాళ్లు (అంతా ఉత్తిదే. ఆ నాయాళ్లకసలు చూపించాలనే ఉండదు). యింకొందరైతే తమ మీద దోషం లాకుండా 'రాసుకోరా' అని ఆన్సరు పేపర్ని సైడుకు పెట్టే వాళ్లుగానీ రాసుకునే లోపలే తిరిగి మూసేసుకునే వాళ్లు. దాంతో మనోడు సగం రాసి, సగం రాయక గమ్మున అయిపోయేవాడు పాపం.

అయితే యిట్టా గమ్మున కూచున్నోళ్లని మా టీచర్లు ఒదిలిపెట్టరు గదా. మరసటి రోజు దిద్దిన పేపర్లిస్తా తక్కువ మార్కులొచ్చినందుకు ఊపిరి తీసి ఒదిలిపెట్టేవాళ్లు. (మా రమాదేవి టీచర్ అయితే మార్కులని బట్టి పేపర్లు ఎనక మంచి యిచ్చేది. అంటే ముందు పది మార్కులు వచ్చినోళ్లకీ తర్వాత పన్నెండు మార్కులు వచ్చినోళ్లకీ... అట్టా యిచ్చుకుంటా వచ్చి అఖర్న యిరవై అయిదుకి యిరవై నాలుగు వచ్చినోడి పేపరిచ్చి వాడి గొప్పకు అందరిచేతా చప్పట్లు కొట్టించేది. ఈ దోవన ఆమె పేపర్లు యిచ్చేటప్పుడు సహజ సిద్దంగానే సురేషుగాడి పేపరే ఫాస్టయ్యేది- నాలుగూ లేదా గెట్టిగా మాట్లాడితే అయిదుమార్కులతో. అసలికే ఫాస్టు పేపరు... దానికితోడు పచ్చిబెత్తం రెడీ... పైగా కొట్టడానికి అలివిగావంత హుషారు... నాయినా...మనోడికి వుల్లుగా పడిపోయేది కోటింగు. యీడి తర్వాత తక్కువ మార్కులు వచ్చిన నాబోటి వాళ్లకి దెబ్బల డోసు తగ్గతా వచ్చేది).

యీ దెబ్బల బాదకు తాళల్యాక, మార్కులు తెచ్చుకోలాక మస్తాన్ సురేషుగాడు చదువు అబ్బించుకోవడానికి ఏందేందో చేసే వాడు. తాయెత్తులు కట్టుకునే వాడు. ఒకసారి మా కావలి దగ్గర 'బళ్లమ్మ' అనే దేవత ఉంటే - వాళ్ల నాయిన్ను బలవంతం చేసి ఆమె కాడికి పోయినాడు చదవుకోసం.

ఆమె యీడి నాలికని యింత పొడుగున

బయటికి తీయించి చూసి 'జెరిగొడ్డంత నిలువుగీత ఉంది గదబయా' అని, చదు్కొ్వానికి యీడి నాలిక మీద సామ్రాణి కడ్డీతో ఏందో మంత్రం రాసిందట.

అది రాయించుకొచ్చినప్పట్నించి 'బళ్లమ్మ మంత్రం రాసిందిలేయ్యా. రెండు నెల్లు ఆగు. ఎట్టా చదువొస్తుందో చూద్దూగాని' అని అడిగినోడికీ అడగనోడికీ కూడా సురేషుగాడు నాలిక చూపించడం మొదలుపెట్టినాడు.

రెండు నెల్లు గడిచినాయి. యింకో యూనిట్ టెస్టు వచ్చింది.

సేమ్‌మార్కులు! సేమ్ కోటింగు!

దాంతో మనోడు తత్తర బిత్తరయిపోయి, యింక లాబం లేదనుకొని యీడి పక్క వెంబరైన నాతోటి యాపారానికొచ్చేసినాడు.

ఒకో 'డాఘా' చూపిస్తే ఐదు పైసలు.

రెండు మార్కుల కొసెనుకు పది పైసలు.

అయిదు మార్కుల కొసెనుకు పావల.

పరీక్ష అయిపోవడంతోటే క్యాషుడౌను. అదీ లెక్క.

సురేషుగాడితో ఎప్పుడైతే యీ లెక్క కుదిరిందో అప్పట్నించి నా దశే మారిపోయింది. యీడి కోసమని యూనిట్ టెస్టు పరీక్షలకి మొత్తం పాఠాలు చదవక పోయినా టీచర్లు టిక్కుపెట్టిచ్చిన ఇంపార్టెంట్ కొసెన్లయినా చదువుకొని వచ్చే వాణ్ణి. అవి గుడ్డేటుగా తగిలినాయో ఒకో కొసెనుకూ ఒకో కాసూ సంపాదించినట్టే.

ఈ లెక్కన పరీక్షకి అద్దరూపాయి తగ్గకుండా ఆరు సబ్జెక్టులకీ కలిపి మూడు రూపాయిలన్నా సంపాదించేవాణ్ణి.

అన్ని డబ్బులంటే మాటలా? వాటితో నా రావందాడి అలివికొచ్చేది కాదు.

జీవితంలో తొలిసారిగా సింగు స్వీట్‌స్టాల్లో గులాబ్‌జాము కొనుక్కోని తినగలగడం, కోటమ్మ బొంకులో నాకిష్టమొచ్చినన్ని 'వేటగాడు' 'సాహసావంతుడు' బొమ్మల్ని కొనుక్కొని అట్టలకు కరిపించుకోవడం, ఒకతట్టు బులుగింకు, యింకో తట్టు రెడ్డింకు రీఫిళ్లుండే 'రెండు తలకాయల పెన్ను' కొనుక్కొని మిడిసి పడటం... ఒక్కటని కాదులే.

ఈ సంపాదన మరిగి నేనూ, పరీక్షల్లో దెబ్బల బాద కొంతయినా తగ్గినందుకు సురేషుగాడూ ఒకరికొకరం దెగ్గరయి కొన్నాళ్లకు బాగా క్లోజయి పోయినాం. పరీక్షలు ఉన్నా లాకపోయినా రోజా ఒంటేలు గెంటలో ఐసులూ కమ్మర్‌కడ్డీలూ కొనిపెట్టేవాడు సురేషు దయగా.

ఆ మహానుబావుడు వుండబట్టి సరిపోయింది గానీ అరిచి గీపెట్టి, కాళ్లు నేలకేసి తపాతపా బాది ఆగిత్యం చేసినా సరే ఐదంటే ఐదుపైసలన్నా యిదిలించని మా అమ్మ వల్ల ఒక చిరుతిండైనా తినగలిగి వుండేవాణ్ణా? ఒక రుచన్నా ఎరిగుండేవాణ్ణా? నిజానికి మా అమ్మ కంటే కూడా మస్తాన్ సురేషుగాడే వన్నెక్కువగా సాకినాడు మా ఇస్కూల్లో.

అంతేకాదు. ఒకసారి పేద్ద గండం నుంచి తప్పించి నన్ను రుణగ్రస్తుణ్ణి చేసినాడు. ఆ సంగతి చెప్పకుంటే వాడి కతకు అన్యాయం చేసినోణ్ణవతాను...

ఒకసారి ఏందో కరువొచ్చి పడ్డట్టుగా మా యింట్లో మూడు రోజులపాటు ఒక్క నయాపైసా కూడా చూళ్లేదు మేము.

'బజార్లో యాడా పనులే దొరకడం లేదుమే' అంటా దమ్మిడీలాకుండా ఇంటికొస్తుండినాడు మా నాయిన.

మా అమ్మకిది అలవాటే కాబట్టి అప్పోసప్పో చేసి దబర దించిపెట్టింది.



ఆ మూడు రోజులూ దరిద్రం కొడతా చెట్నితో చారుతో ముగిసినాయి.

నాలుగో రోజున బలే కుషీగా వచ్చినాడు మా నాయిన. జేబులో నుంచి యాభై రూపాయిలు దీసి వేలితో టపా టపా కొట్టినాడు హుషారుగా.

దాన్ని చూట్టంతోటే మొకం చేటంత చేసుకుని 'బియ్యం తెచ్చేదా' అంటా లేచింది మా అమ్మ.

'యీదిలోకి పొయ్యి చేపలొచ్చినాయేమో చూసి సాచ్చేదబయా' అంది మా నాయినమ్మ.

మా నాయిన నోటును అట్టాగే పట్టుకొని – 'మీరేమయినా చేసుకోండబ్బా. ఉండేది యాభై. నాకు మాత్రం ప్యాకీ సిగరెట్లు కావాలి' అన్నాడు.

అన్నాక నా తట్టు చూసి 'రే... ముందర సిగిరెట్లు తేబో. అట్టాగే నువ్వొక పావలాకి కొనుక్కోపో' అన్నాడు.

'పావల' అనే మాట చెవిన పడటంతోటే ఎప్పుడు యాభై అందుకున్నానో ఎప్పుడు చొక్కాజేబులో పెట్టుకున్నానోగాని గిద్‌గిద్‌మని పరిగెత్తతా మరుక్షణంలో యీది చివరి బొంకు కాడ తేలినాను.

చూస్తే ఏముంది? జేబు ఖాళీ!

నా గుండె ఆగినంత పనయ్యింది. ఒంటేలు పడిపోయినాయి.

యాభై రూపాయలంటే (అప్పట్లో) చిన్న యిషయమా?

'యా పీర్... మస్తాన్‌వలీ' అనుకుంటా వచ్చిన దోవలోనే వెయ్యికళ్లు పెట్టి దేవులాడినాను నోటు.

జేబులో నుంచి ఎప్పుడు జారిపోయిందో గాలికి ఎటు ఎగిరిపోయిందో నోటు. అవుపణ్ణే లేదు.

'మస్తాన్ వలీ! యాభై రూపాయలు కనబడేటట్టు చెయ్యిసామీ... నీ పేరున టెంకాయ కొడతా' అని మనసులోనే ప్రాదేయపడతా మొక్కుకున్నాను.

పలితం చిక్కలేదు. నాకు ఏడుపొచ్చేసింది.

'యింక యింటికి ఏ మొకం పెట్టుకొని వెళ్లను' అని ఏడ్చుకుంటా మస్తాన్ వలికి మొక్కుకుంటా వుంటే మస్తాన్ సురేషుగాడు గుర్తుకొచ్చినాడు.

ఆశ ఎలిగింది!

ఎమ్మట్నే లగెత్తుకుంటా వాళ్లింటికి పోయి 'యిట్టిట్టా సంగతిరా... డబ్బులు పోయినాయిరా' అని ఏడ్చుకుంటా చెప్పినాను.

నా ఏడుపు చూసి వాడిక్కూడా బలే బాదయిపోయింది.

'ఉండు. మా నాయిన ఇంట్లోకి పోనీ' అన్నాడు బరోసాగా. (వాళ్లది ముందర వైపు అంగడి. వెనుకవైపు ఇల్లు. ఇప్పటికీ).

కొంత సేపటికి వాళ్ల నాయిన ఇంట్లోకి పోంగానే గల్లాపెట్టెకాడ కూచున్నట్టుగా కూచొని సైగ్గా యాభై రూపాయల నోటు నూక్కొచ్చి నాకిచ్చేసినాడు.

దాన్ని చూడంగానే దేవుడు కనిపించినంతయ్యింది నా పని.

'సామీ... నువ్వురా మస్తాన్‌వలీ అంటే. నీకురా టెంకాయ కొట్టాల్సిందా' అని వాడికి నమస్కారాలు చేసి 'యెప్పటికైనా నీ యాభై నీకిచ్చేస్తామురా' అన్నాను కృతజ్ఞతగా.

అట్టా వాడివల్ల నాగండం తీరడమే కాదు. ఆ పూట నా వల్ల పెద్ద యుద్ధం జరిగి మేమందరం పస్తుండాల్సిన యాతన కూడా తప్పింది.

యిది జరిగిన తర్వాత యూనిట్ టెస్టుల్లో వాణ్ణెప్పుడూ కొసెనుకింతని డబ్బులు అడగనే లేదు నేను.

*

– ఆ తర్వాత సురేషుగాడు హైస్కూల్లోనే చదువొదిలేసి యాపారాన్ని పట్టుకున్నాడు. యిప్పుడోడు 'న్యూ సత్యనారాయణ అండ్ సన్సు'కి ఏకైక ఓనరు. అయినా వాడు నా బాకీ మర్చిపోలేదు. కనిపించినప్పుడల్లా 'నా యాభై ఏదిరా?' అని అడగతానే ఉంటాడు... నవ్వతా... ప్రేమగా .

–మహమ్మద్ ఖదీర్‌బాబు